సాక్షి చిత్తూరు

సోమవారం । 16 । సెప్టెంబర్ । 2024



వైభవం.. వరసిద్ధుని సంబరం

కాణిపాకంలోని వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు అశ్వవాహనంపై కటాక్షించారు. - 8లో



బొలెరో బోల్తా: ఒకరి మృతి

బొలెరో వాహనం బోల్తా పడి ఒకరు మృతి చెందగా 23 మంది గాయపడిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. - 8లో



చెరువు మట్టి.. కొల్లగొట్టి!

అధికారపార్టీ నేతలు చెరువు మట్టిని కొల్లగొట్టి జేబులు నింపుకుంటున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. - 8లో

న్యూస్‌రీల్

నేటి గ్రీవెన్స్ రద్దు

చిత్తూరు అర్బన్: చిత్తూరు లో నిర్వహించాల్సిన పోలీసు గ్రీవెన్స్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక)ను రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ ఓ ప్రకటనలో తెలిపారు. మునిసిపల్ కార్యాలయంలో గ్రీవెన్స్‌ను సైతం రద్దు చేస్తున్నట్లు కమిషనర్ నరసింహ ప్రసాద్ తెలిపారు. సోమవారం మిలాద్‌నబీ పండుగ సందర్భంగా గ్రీవెన్స్‌ను రద్దు చేసినట్లు అధికారులు చెప్పారు.

మొగిలి ఘాట్‌లో లోపాలను సరిచేస్తాం

చిత్తూరు అర్బన్: బంగారుపాళ్యం–మొగిలి ఘాట్ రోడ్డులో నెలకొన్న సాంకేతిక సమస్యలను త్వరలోనే సరిచేస్తామని, ముమ్ముందు ఇక్కడ మరో ప్రమాదం జరగకుండా చేయడానికి ప్రయత్నిస్తామని చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. ఆదివారం ఆయన చిత్తూరులో మీడియాతో మాట్లాడుతూ దాదాపు ఇక్కడ 3 కి.మీ దూరం వరకు రోడ్డుపై నెలకొన్న ఇంజనీరింగ్ సమస్యను వెంటనే పునరుద్ధరించాలని కలెక్టర్ ఆదేశించినట్లు తెలిపారు. రోడ్డుకు మధ్యలో ఉన్న డివైడర్ ఎత్తు పెంచడం, అటవీశాఖ అనుమతులు వచ్చిన వెంటనే లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయడం, ప్రమాదాలు నివారించడానికి మైకు ద్వారా డ్రైవింగ్ చేసే వ్యక్తిని అలర్ట్ చేయడం, నిద్రమత్తులో ఉన్న వాళ్ల ముఖాన్ని చల్లని నీటితో (స్టాప్ వాష్) శుభ్రం చేసుకుని వెళ్లేలా అవగాహన కల్పిస్తామన్నారు. రహదారి భద్రత కోసం పోలీసు వాహనాలను సైతం ఉపయోగిస్తామన్నారు.

నులిపురుగుల నిర్మూలన దినోత్సవం రేపు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఈ నెల 17న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 19 ఏళ్ల లోపు పిల్లలందరూ ఆల్బెండజోల్ మాత్రలు తప్పకుండా వేసుకునేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లాలోని 5466 పాఠశాలల్లో 3,63,888 మంది విద్యార్థులకు మాత్రలు వేయించేలా ప్రణాళికలు సిద్ధం చేశారన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులు 43,787 మంది, బడిబయట విద్యార్థులు 4486 మందికి, అంగన్‌వాడీ కేంద్రాల్లోని 78,924 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేసేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

డీఎస్పీలకు పోస్టింగులు


చిత్తూరు అర్బన్: జిల్లాలో ఖాళీగా ఉన్న సబ్–డివిజన్లకు డీఎస్పీలను నియమిస్తూ రాష్ట్ర డీజీపీ ద్వారక తిరుమలరావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. పల్నాడు మహిళా పోలీస్ స్టేషన్ నుంచి బి.ప్రసాద్‌ను చంద్రగిరికి, సీఐడీలో ఉన్న ఏనుగంటి శ్రీనివాసరావును రేణిగుంటకు, ఏసీబీలో ఉన్న వి.గిరిధర్‌ను తిరుపతి స్పెషల్‌బ్రాంచ్‌కు, పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఎం.రాజగోపాల్‌రెడ్డిని తిరుపతి పోలీసు శిక్షణ కేంద్రానికి, షానుషేక్‌ను చిత్తూరు పోలీస్ శిక్షణ కేంద్రానికి బదిలీ చేశారు.

మంత్రి విమర్శలు దారుణం



టీడీపీ పాలనలో ఒక్క మెడికల్ కళాశాల కూడా రాలేదు. పేద, మధ్య తరగతి విద్యార్థుల ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని గత ప్రభుత్వంలో మెడికల్ కళాశాలలను పకడ్బందీ ప్రణాళికతో ప్రారంభించారు. మిగతా ప్రక్రియను పూర్తి చేయకుండా ప్రైవేటు పరం చేసి, జగన్ వచ్చి పాఠాలు చెబుతారా అంటూ మాజీ ముఖ్యమంత్రిని ఇప్పటి మంత్రి విమర్శించడం సరికాదు. పేద విద్యార్థులు వైద్య విద్య చదవాలంటే లక్షలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వమే బాధ్యతగా మెడికల్ కళాశాలను నిర్వహించి మెడికల్ సీట్లు కేటాయించాలి.

– ప్రవీణ్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్, చిత్తూరు



టీడీపీ పాలనలో ఏం చేశారో చెప్పాలి



2019కు ముందు మెడికల్ విద్యార్థుల కోసం టీడీపీ పాలనలో ఏం మేలు చేశారో వెల్లడించాలి. గత ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా పేద, మధ్య తరగతి విద్యార్థుల కోసం కోట్లు ఖర్చు చేసి మెడికల్ కళాశాలలను ప్రారంభించింది. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి మెడికల్ సీట్లు వద్దు అని ఎందుకు లేఖ రాశారో తెలపాలి. మెడికల్ విద్యార్థులకు భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం చేసిన తప్పులను కప్పి పుచ్చుకుంటోంది. వైద్య కళాశాల సీట్ల విషయంలో కూటమి ప్రభుత్వం ధోరణి మార్చుకోవాలి.

– ధనుష్‌బాబు, నీట్‌విద్యార్థి, చిత్తూరు

ఆధ్యాత్మిక వస్త్ర నగరి

పరివట్టం వస్త్రాలు





ఆధ్యాత్మిక వస్త్రాలు నేస్తున్న కార్మికుడు

అయ్యప్ప మాల, గోవిందమాల ధారణ భక్తులు ధరించే వస్త్రాలు నేయడంలో నగరి నేతన్నలు ప్రత్యేకత చాటుకుంటున్నారు. తనదైన శైలిలో ఆధ్యాత్మిక సంబంధిత వస్త్రాలను నేస్తూ భక్తులను మెప్పిస్తున్నారు. ఎంతో మన్నిక, సౌకర్యవంతంగానే కాకుండా చూడగానే ఆకట్టుకునే డిజైన్లతో వస్త్రాలను రూపొందిస్తున్నారు. అన్ని సీజన్లకూ అవసరమైన దుస్తులను నేయడంలో ప్రావీణ్యం సంపాదించి, ఉపాధికి దోకా లేకుండా సాగిపోతున్నారు.

దీక్షా వస్త్రాలు



మాలధారణ వస్త్ర తయారీ

వివిధ దేవుళ్లకు, దేవతలకు దీక్ష పూని ధరించే వస్త్రాల తయారీకి కూడా నేత కార్మికులు ప్రాధాన్యత ఇస్తున్నారు. అయ్యప్ప దీక్షకు వాడే నలుపు, నీలం, కాషాయం రంగు వస్త్రాలు, గోవిందమాలకు వాడే పసుపు రంగు వస్త్రాలు, సుబ్రమణ్యస్వామి దీక్షకు వాడే పచ్చ రంగు వస్త్రాలు, అమ్మవారి దీక్షకు వాడే ఎరుపు రంగు వస్త్రాలు అంటూ వీటిని ప్రత్యేకంగా తయారు చేస్తున్నారు.

- మురిపించే వస్త్రాలు నేయడంలో నేతన్న ముందడుగు
- ఆలయ కుంభాభిషేకాలు, దీక్షధారణ వస్త్రాల తయారీలో దిట్ట
- వస్త్రాలు నేసే సమయంలో పవిత్రతకు ప్రాముఖ్యత



వేదిక వస్త్రాలు నేస్తున్న నేత కార్మికుడు

నగరి: కాటన్(నూలు) వస్త్రాల తయారీలో జిల్లాలోని నగరి, మదనపల్లె, సత్యవేడు నియోజకవర్గాలు చేనేతకు ప్రసిద్ధి. చేనేత నుంచి నవీకరణలో భాగంగా మరమగ్గ నేతవైపు ప్రయాణించారు. గుజరాత్ తర్వాత మరమగ్గాలు వాడిన ప్రాంతంగా నగరి నేత పరిశ్రమ 1976లోనే పేరుగాంచింది. అప్పట్లోనే యునైటెడ్ స్టేట్స్, యూరప్, జపాన్ లాంటి దేశాల నుంచి కార్పొరేట్ కంపెనీలకు చెందినవారు నగరికి వచ్చి చొక్కాలు, నూలు దుస్తులకు ఆర్డర్లు ఇచ్చేవారు. నగరి, పుత్తూరు, నారాయణవనంలోని వస్త్ర ఉత్పత్తిదారులు విదేశీ కంపెనీలతో సత్సంబంధాలు కలిగివుండేవారు. చొక్కా తానుల తయారీలో పేరు గాంచిన నగరి పరిశ్రమ, విదేశీ ఆర్డర్లు తగ్గుముఖం పట్టడంతో చుడీదార్ల తయారీపై మొగ్గుచూపింది. ప్రస్తుతం వాటితో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వాడే వస్త్రాల తయారీలో ముందడుగు వేస్తున్నారు.

వస్త్రాల తయారీలో పవిత్రతకు ప్రాధాన్యత

కుంభాభిషేక వస్త్రాలు, మాలధారణ దీక్షా వస్త్రాలు తయారుచేసే సమయంలో నేత కార్మికులు అత్యంత పవిత్రంగా ఉంటారు. ఆ వస్త్రాలు నేసే ముందు స్నానం తప్పనిసరి. ఆ రోజుల్లో పూర్తిగా మద్యం సేవించరు. మాంసాహారం భుజించరు. బంధువులు కాలం చేసి, అంటు ఉన్న సమయంలో ఇలాంటి వస్త్రాలు నేయరు. ఇలా ఎంతో పవిత్రంగా వస్త్రాలు నేస్తారు. కొలతలను అనుసరించి రోజుకు 15 నుంచి 20 వస్త్రాలు ఒక మగ్గంలో తయారవుతాయి.

మరమగ్గాల (పవర్‌లూమ్)పై ఆధారపడిన కుటుంబాలు **25000**

మరమగ్గాల సంఖ్య **16000**

ఆధ్యాత్మిక వస్త్ర తయారీపై ఆధార పడినవారు సుమారు **5000**

కుంభాభిషేక వస్త్రాల తయారీ



ఆచార్య వస్త్రాలు

ఆలయ కుంభాభిషేకాలకు ఉపయోగించే ప్రధాన ఆచార్య వస్త్రాలు, సాధిక వస్త్రాలు, దీక్షా వస్త్రాలు, వాస్తు వస్త్రాలు, కలశపూజలు నిర్వహించే వేదికా వస్త్రాలు, నవగ్రహాలకు వాడే తొమ్మిది రంగుల వస్త్రాలు, పరివట్టం, కుంభాభిషేక చీరలు, రవికలు, వినాయక విగ్రహాలకు కట్టే పంచలు, కలశాలపై ఉంచే దుస్తులు తదితర దుస్తులన్నీ ఇక్కడ తయారవుతాయి. వీటిని నేసే సమయంలో అత్యంత పవిత్రంగా ఉంటారు.



వినాయక పంచలు

ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు సరఫరా

ఇక్కడ నేసే ఆధ్యాత్మిక వస్త్రాలకు మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ మంచి గిరాకీ ఉంది. తమిళనాడుకు చెందిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన కుంభకోణం, తంజావూరు, మధురై, పళని, చిదంబరం, తిరువణ్ణామలై, కాంచీపురం, తిరుచ్చి, కన్యాకుమారి, తిరుచందూర్, నాగర్‌కోవిల్ ఆలయాల్లో జరిగే వేడుకలకు ఇక్కడి నుంచి వస్త్రాలు తీసుకెళ్తారు. వ్యాపార కేంద్రాలైన చెన్నై, ఈరోడ్‌కు చెందిన వారు ఇక్కడి నుంచే ఆధ్యాత్మిక వస్త్రాలను కొనుగోలు చేసుకుంటారు.

రోజుకు 15 నుంచి 20 వరకు వస్త్రాలు నేస్తాం



ఆధ్యాత్మిక వస్త్రాలు నేసే సమయంలో పవిత్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాం. స్నానం చెయ్యకుండా వస్త్రాలు నేయం, మాంసాహారం, మద్యం సేవించం. అంటు ఉన్న సమయాల్లో దుస్తులు నేయం. నేసే వస్త్రాల కొలతలు, ఆర్డర్లను అనుసరించి రోజుకు 15 నుంచి 20 వస్త్రాలు ఒక మగ్గంలో నేయవచ్చు.

– వాసు, నేత కార్మికుడు, నగరి

ఆధ్యాత్మికతే పని కల్పిస్తోంది



ఆధ్యాత్మికతకు వస్త్రాలకు చాలా దగ్గర సంబంధం ఉంది. మాలధారణ సమయంలో వారు ధరించే దుస్తులు వారిని నిష్టగా ఉంచుతాయి. కొందరు మాలధారణలో లేకున్నా ఆధ్యాత్మిక చింతనలో ఉండాలన్న కోరిక ఉంటే కాషాయం రంగు దుస్తులు ఎక్కువగా ధరిస్తారు. అందుకే ఆ దుస్తులు అత్యంత పవిత్రంగా నేస్తాం. ప్రస్తుతం ఈ వస్త్రాలే పలువురికి పని కల్పిస్తున్నాయి.

– నటరాజన్, నేతకార్మికుడు, పుదుపేట

ప్రాథమిక విద్యకు సర్దుపోటు

- గంగాధరనెల్లూరు నియోజకవర్గం కార్వేటినగరం మండలం ఈదువారిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 22 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు ఒకే ఉపాధ్యాయుడు పాఠాలు బోధిస్తున్నాడు. ఆ ఒక్క టీచర్ సెలవు పెడితే పిల్లల పరిస్థితి అయోమయం. ఇలాంటి పరిస్థితే గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో మరిన్ని పాఠశాలల్లో నెలకొంది. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ప్రత్యామ్నాయ నదుపాయాలు కల్పించకుండా సర్దుబాట్లు పేరుతో బడులను నిర్వీర్యం చేస్తున్నారు.
- పలమనేరు నియోజకవర్గం పెద్దపంజాణి మండలం చీకలదిన్నేపల్లి, కూరగాయల కొత్తపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలు. ఈ రెంటింటిలో ఒక్కొక్క పాఠశాలలో 10 మంది చొప్పున 20 మంది విద్యార్థులు ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు చదువుతున్నారు. ఏకోపాధ్యాయుడి కారణంగా ఆ రెండు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగడం లేదు. టీచర్ల సంఖ్యను పెంచాలని ఆ గ్రామస్తులు పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించారు. అయినా ఏ మాత్రం ఫలితం లేదు. గత్యంతరం లేక ఈ విద్యాసంవత్సరంలో విద్యార్థులను ప్రైవేటు బాట పట్టించారు.

- శాపంగా మారిన సర్దుబాటు
- ప్రాథమిక బడులన్నీ ఇక ఏకోపాధ్యాయ పాఠశాలలే
- జిల్లాలో 464 మంది టీచర్ల సర్దుబాటు



పాఠశాలలో విద్యార్థులు

సర్దుబాటు ప్రక్రియ సమాచారం	
జిల్లాలో ఏకోపాధ్యాయ పాఠశాలలు	1,024
సర్దుబాటు పొందిన స్కూల్ అసిస్టెంట్‌లు	184
సర్దుబాటు పొందిన ఎస్‌జీటీలు	280
మొత్తం టీచర్ల సర్దుబాటు	464

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక విద్యను బలోపేతం చేయాల్సిన కూటమి సర్కారు నిర్వీర్యం చేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేపట్టిన సర్దుబాటు ప్రక్రియ ప్రాథమిక విద్యకు పోటుగా మారింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోని ఎస్జీటీలను ఉన్నత పాఠశాలలకు సర్దుబాటు చేశారు. ఈ ప్రక్రియ వల్ల జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న ప్రాథమిక పాఠశాలల ఉనికి అగమ్యగోచరంగా మారింది. దీంతో ఏకోపాధ్యాయ పాఠశాలల సంఖ్య పెరగనుంది.

బలవంతంగా సబ్జెక్టు టీచర్లుగా..

జిల్లా వ్యాప్తంగా 2,467 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో గత ప్రభుత్వంలో అర్హులైన ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులు కల్పించి సర్దుబాటు ప్రక్రియను నిర్వహించారు. అయితే మళ్లీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం మెథడాలజీ ఉన్న ఎస్‌జీటీలను బలవంతంగా సబ్జెక్టు టీచర్లుగా సర్దుబాటు చేసేసింది.

ఫలితాలపై ప్రభావం

మనస్ఫూర్తిగా ఉద్యోగోన్నతి వద్దంటూ ప్రభుత్వానికి లేఖలిచ్చి ఎస్‌జీటీలుగా కొనసాగుతున్న వారిని ప్రస్తుతం స్కూల్ అసిస్టెంట్‌లుగా సర్దుబాటు చేశారు. గత మూడు నెలలుగా ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు పాఠాలు బోధించిన టీచర్లు ఉన్న ఫలంగా హైస్కూల్లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పాఠాలు ఎలా చెప్పగలరని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఈ సర్దుబాటు ప్రక్రియ పదవ తరగతి విద్యార్థుల ఫలితాలపై ప్రభావం చూపుతుందని మేధావులు చెబుతున్నారు.


టీచర్ పోస్టులు భర్తీ చేయలేక..

జిల్లాలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయలేక సర్దుబాటు ప్రక్రియకు కూటమి ప్రభుత్వం తెరలేపింది. చంద్రబాబు సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే డీఎస్సీ నిర్వహిస్తానంటూ హడావుడిగా తొలిసంతకం చేశారు. అయితే మూడు నెలలు ముగిసినా ఇప్పటి వరకు డీఎస్సీ నోటిఫికేషన్ ఊసేలేదు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 353 ఉన్నత పాఠశాలల్లో అవసరమైన మేరకు స్కూల్ అసిస్టెంట్‌లు లేకపోవడంతో జీవో 117 ప్రకారం ఎస్‌జీటీలను సర్దుబాటు చేసింది. జిల్లా వ్యాప్తంగా హైస్కూళ్లలో మిగులుగా ఉన్న సబ్జెక్ట్ టీచర్లను అవసరమైన పాఠశాలలకు సర్దుబాటు చేస్తే సరిపోతుంది. కానీ ప్రభుత్వం ఇష్టానుసారంగా సర్దుబాటు ముగించిందని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

డీఎస్సీ హుళక్కే?

హైస్కూళ్లలో ప్రస్తుతం ఉన్న ఖాళీలకు ఉద్యోగోన్నతులతో భర్తీ చేయాలే తప్ప బలవంతంగా ఎస్జీటీ టీచర్లకు సర్దుబాటు చేయకూడదు. ఉద్యోగోన్నతులు నిర్వహించిన తర్వాత ఏర్పడే ఖాళీలను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలి. ఉన్న టీచర్లతో సర్దుబాటు ప్రక్రియ ముగించేయడంతో డీఎస్సీ ఇంకెప్పుడు నిర్వహిస్తుందోనని బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


ప్రాథమిక విద్య నిర్వీర్యం కాకూడదు



ప్రాథమిక విద్య నిర్వీర్యం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. సర్దుబాటు ప్రక్రియను ప్రహసనంగా మార్చేశారు. సర్దుబాటు వల్ల ఎక్కువ సంఖ్యలో టీచర్లు మిగులు ఖాతాలోకి వస్తున్నారు. ఈ ప్రక్రియ వల్ల ప్రాథమిక పాఠశాలల మనుగడ ప్రశ్నార్థంగా మారింది.

– బాలాజీ, ఏపీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు

సరైన నిర్ణయం కాదు



సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయ పోస్టులను కుదించడం సరైన నిర్ణయం కాదు. ఇది విద్యా ప్రమాణాలకు ముప్పు. ప్రాథమిక విద్యలో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలి. ఉన్నత తరగతుల్లో కూడా ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి ప్రకారం ఉండాలి. అలా ఉంటేనే విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయి.

– జీవీ రమణ, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

'విశాఖ' బ్యాంక్ ప్రారంభం

చిత్తూరు అగ్రికల్చర్: వ్యాపార దృక్పథంతో పాటు సామాజిక సేవ చేయాలన్న సంకల్పంతో ది విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంక్ ఆవిర్భవించిందని ఆ బ్యాంక్ చైర్మన్ తలసాని రాఘవేంద్రరావు తెలిపారు. జిల్లా కేంద్రంలో ఆదివారం 53వ బ్రాంచ్‌ను సిటిజన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ రంగరాజులు ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో బ్యాంక్ చైర్మన్ తలసాని రాఘవేంద్రరావు మాట్లాడారు. విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంక్ 1916లో విశాఖపట్నం కేంద్రంగా ప్రారంభించామన్నారు. ఈ బ్రాంచ్ సేవలను నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మూడేళ్లలో చిత్తూరు బ్రాంచ్ ద్వారా రూ.100 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నెల్లూరు, కోయిలగుంట్ల, తిరుపతి, ప్రొద్దుటూరు బ్యాంక్ చైర్మన్లు నాగేంద్రసాయి, శ్రీనివాస్, రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, బ్యాంక్ డైరెక్టర్లు స్టాలిన్ వెంకటరమణ, ప్రసాద్‌రావు, సత్యనారాయణమూర్తి, కమ్యూనిస్టు నాయకులు నాగరాజు, జనార్దన్, బ్రాంచ్ మేనేజర్ సురేష్ పాల్గొన్నారు.

రూ.66 లక్షల విలువైన సెల్‌ఫోన్ల అప్పగింత



సెల్‌ఫోన్లను పొందిన వారితో చిత్తూరు ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: చోరీకి గురైన, పోగొట్టుకున్న దాదాపు రూ.66 లక్షల విలువైన సెల్‌ఫోన్లను పలు ప్రాంతాల నుంచి స్వాధీనం చేసుకున్న చిత్తూరు పోలీసుశాఖ.. వాటిని బాధితులకు అప్పగించింది. చిత్తూరులోని పోలీసు అతిథిగృహంలో ఆదివారం ఎస్పీ మణికంఠ చందోలు వివరాలను మీడియాకు వెల్లడించారు. సెల్‌ఫోన్లను ఏ రకంగా పోగొట్టుకున్నా వాటిని తిరిగిపొందడానికి ఏర్పాటు చేసిన చాట్‌బాట్ వ్యవస్థ సమర్థంగా పనిచేస్తోందన్నారు. పలువురు బాధితులు పోగొట్టుకున్న దాదాపు రూ.66 లక్షల విలువచేసే 305 మొబైల్ ఫోన్లను నెల రోజుల్లో రికవరీ చేసి.. వాటిని బాధితులకు అందించామన్నారు. జిల్లాలో మొత్తం ఎనిమిది విడతల్లో రూ.4.96 కోట్ల విలువ చేసే 2335 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని బాధితులకు అందచేశామన్నారు. ఇది చిత్తూరు పోలీసుశాఖ పనితీరుకు నిదర్శమన్నారు. చాట్‌బాట్‌లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది ఫోన్లను కనిపెట్టి, వాటిని ఇక్కడకు రప్పించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని చెప్పారు. ఏపీతో పాటు తెలంగాణ, కేరళ, మహారాష్ట్ర నుంచి ఫోన్లను ట్రాక్‌చేసి ఇక్కడకు తీసుకొచ్చి బాధితులకు అందిస్తున్నామన్నారు. ఫోన్–9440900004 (చాట్‌బాట్) నెంబర్‌తో పాటు www.ceir.gov.in/ home/ index.jrp అనే వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదులు ఇవ్వొచ్చని ఎస్పీ తెలిపారు. క్రైమ్ సీఐ ఉమామహేశ్వరరావు, ఎస్‌బీ సీఐ భాస్కర్, సిబ్బంది బాపూజీ, శ్రీనివాస్, రఘును ఎస్పీ అభినందించారు.

క్లుప్తంగా

మరొకరిని బలి తీసుకున్న ఘాట్ ప్రమాదం


పద్మావతి (ఫైల్)

గంగాధర నెల్లూరు: మూడు రోజుల క్రితం జరిగిన మొగిలి ఘాట్ ప్రమాదంలో మృతుల సంఖ్య 8కి చేరింది. గ్రామస్తుల కథనం మేరకు మొగిలి ఘాట్‌లో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గంగాధర నెల్లూరు మండలం పాపిరెడ్డి పల్లెకు చెందిన ఎన్ ఎస్ భాస్కర్ రెడ్డి సతీమణి పద్మావతి (49) తీవ్రంగా గాయపడింది. ఆమె వేలూరు సీఎంసీలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందింది. ఈమె భర్త బెంగళూరులో టైలరింగ్ వృత్తిలో స్థిరపడ్డారు. ముగ్గురు కుమార్తెలకు వివాహం కాగా బెంగళూరులోనే ఉంటున్నారు. డ్వాక్రా సంఘంలో రుణం కోసం జీడీ నెల్లూరుకు వచ్చి, తిరిగి బెంగళూరుకు వెళుతున్న సమయంలో మొగిలి ఘాట్ ప్రమాదంలో గాయపడి తిరిగిరాని లో కాలకు వెళ్లడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. పద్మావతి మరణంతో గ్రా మంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అతిసారంతో మహిళ మృతి


వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

బైరెడ్డిపల్లి: మండలంలోని బేలుపల్లెలో అతిసారం విజృంభించడంతో వృద్ధురాలు మృత్యువాత పడింది. వారం రోజులుగా గ్రామంలో కలుషితనీరు కారణంగా అతిసారంతో పలువురు వివిధ ఆస్పత్రుల్లో చికిత్సలు పొందుతున్నట్లు చెప్పారు. ఈ క్రమంలోనే అతిసారం బారిన పడిన మునెమ్మ (65) ఆదివారం మృతి చెందింది. సమాచారమందుకున్న పలమనేరు ఎమ్మెల్యే ఎన్.అమరనాథరెడ్డి గ్రామంలో పర్యటించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాటర్ ట్యాంకులు శుభ్రం చేయాలని, కలుషిత నీరు ఎక్కడ కలుస్తుందో వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం అతిసారం బాధితులను పరామర్శించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని తనిఖీ చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

పేదలకు తీరని అన్యాయం



గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటు పరం చేసే దిశగా అడుగులు వేయడం వల్ల పేద విద్యార్థులకు తీరని అన్యాయం చేస్తోంది. గత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 17 నూతన మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసేందుకు పకడ్బందీగా కార్యాచరణ ప్రారంభించింది. దీంతో నీట్‌లో ప్రతిభ చూపిన మా లాంటి పేద విద్యార్థులకు ఉచిత సీట్లు పొందే వెసులుబాటు కలిగింది. కానీ ఉచిత సీట్లు పెద్ద సంఖ్యలో కోల్పోయే ప్రమాదం ఉంది. ఇంతకు ముందు నీట్‌రాశాను సీటు రాలేదు. ఈ సారైనా వస్తుందనుకుంటున్నా.

- సానియా, వేపగుంట, పుత్తూరు



మా ఆశలపై నీళ్లు



కొత్త ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే మా లాంటి పేద విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లినట్టే. ప్రైవేటు కళాశాలల్లో లక్షలు పెట్టి చదివే స్తోమత మాకు లేదు. కేవలం డబ్బున్న వాళ్లే ఎంబీబీఎస్ చదివే విధంగా ప్రభుత్వం వ్యవహరించడం దారుణం. ఈ ఏడాది నీట్ పరీక్షలో 500కు పైగా ర్యాంకు వచ్చింది. కానీ సీటు రాలేదు. ఇప్పటికే రెండు సార్లు నీట్ కోచింగ్ తీసుకున్నా. ఇప్పుడు మళ్లీ లాంగ్‌టర్మ్ కోచింగ్ పోతున్నాను. వచ్చే ఏడాది నీట్‌లో ర్యాంక్ సాధించి మెడిసిన్‌లో చేరాలని శ్రమ పడుతున్నా.

- టి.ప్రభు, పెద్దతయ్యూరు, శ్రీరంగరాజపురం

వైభవం.. వరసిద్ధుని సంబరం


తిరుకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


స్వామివారి అభిషేకానికి హాజరైన భక్తులు

- గణపయ్యకు శాస్త్రోక్తంగా క్షీరాభిషేకం
- కనులపండువగా కల్యాణోత్సవం
- అశ్వవాహనంపై విహరించిన దేవదేవుడు
- మొక్కులు చెల్లించుకున్న భక్తజనం

ఐరాల/తవణంపల్లె: కాణిపాకం స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి సిద్ధి, బుద్ధి సమేతంగా వినాయకస్వామి అశ్వవాహనంపై పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. మేళ తాళాలు, మంగళవాయిద్యాలు, కోలాటలు, చెక్కభజనల నడుమ స్వామి ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. తిరువణంపల్లె, 44 బొమ్మసముద్రం, చింతమాకులపల్లె, కారకాంపల్లె గ్రామాలకు చెందిన గోనుగుంట, బలిజ వంశీయులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

శతకలశ క్షీరాభిషేకం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం కల్యాణోత్సవ మండపంలో సిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి అష్టోత్తర శతకలశ క్షీరాభిషేకం నిర్వహించారు. కాణిపాకం, తిరువణంపల్లె, వణిగ వంశస్తులు ఉభయదారులుగా వ్యవహరించారు.

శివపార్వతుల భిక్షాటన

తిరుకల్యాణోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం భిక్షాండి కార్యక్రమం నిర్వహించారు. కల్యాణానికి పూజాసామగ్రిని సమకూర్చుకోవడానికి శివపార్వతులు గ్రామంలో భిక్షాటన చేయడం ఆనవాయితీ. కార్యక్రమంలో ఆలయ ఈఓ గురుప్రసాద్, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, అధికారులు, కాణిపాకం సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, దేవస్థానం మాజీ చైర్మన్లు జగ్నన్నాథరెడ్డి, మణినాయుడు, ఉభయదారులు పాల్గొన్నారు.

టీటీడీ తరపున పట్టు వస్త్రాల సమర్పణ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం వినాయక స్వామికి టీటీడీ తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. టీటీడీ ఈఓ జె.శ్యామలరావు ఆధ్వర్యంలో స్వామికి పట్టువస్త్రాలను సమర్పించారు. వీరికి ఆలయ ఈఓ గురుప్రసాద్ స్వాగతం పలికి దర్శనం ఏర్పాటు చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. టీటీడీ ఈఓను పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, సూపరింటెండెంట్లు, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

ఆనవాయితీగా నిలువు దోపిడీ

ఉభయదేవేరీలతో కూడిన గణనాథుడికి కనులపండువగా తిరు కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం ప్రారంభమైన అశ్వవాహన సేవలో గంగుండ్ర మండపం వద్ద ఆనవాయితీ ప్రకారం స్వామివారు నిలువు దోపిడీకి గురయ్యారు. స్వామి ఆభరణాలు, నైవేద్యం, అత్తవారు కట్టించిన కుడుములు, ఉండ్రాళ్లు, చిల్లర, కాసులను దొంగలు దోపిడీ చేసే ఘట్టం జరిపించారు.

నేడు ఉత్సవాలు పరిపూర్ణం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం దేవస్థానం వారిచే ధ్వజావరోహణం కార్యక్రమం, ఉభయదారులచే అభిషేకం, వదాయత్తు ఉత్సవం రాత్రి ఏకాంత సేవ నిర్వహిస్తారు. దీంతో గణనాథుని బ్రహ్మోత్సవాలు పరిపూర్ణం కానున్నాయి.


భిక్షాండి కార్యక్రమంలో ఆలయ అధికారులు


క్షీర కలశాల ఊరేగింపులో ఉభయదారులు


క్షీరాభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు


పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న టీటీడీ ఈఓ శ్యామలరావు

మద్యం మత్తులో ఇరువర్గాల ఘర్షణ

- వ్యక్తికి తీవ్ర గాయాలు
- బెంగళూరుకు తరలింపు

కుప్పం: వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద ఇరువర్గాలు ఘర్షణ పడడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలు.. పట్టణంలోని విజయలక్ష్మీ రోడ్డులో వినాయక ప్రతిమలను టీడీపీ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ రాజ్‌కుమార్ తమ్ముడు వినయ్ స్నేహితులతో కలిసి ఏర్పాటు చేశారు. ఈ పండుగ కోసం పట్టణంలో ప్రముఖ వ్యాపారవేత్త మధుభూషణం కుమారుడు బాలనాగరాజ్‌ను విరాళం ఇవ్వాలని వినయ్ కోరారు. ఈ క్రమంలో చందా వసూళ్లపై ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. మాజీ జెడ్పీటీసీ తమ్ముడు వినయ్ మొదటగా బాలనాగరాజ్‌పై దాడి చేశారు. ఈ విషయాన్ని బాలనాగరాజు పట్టణంలోని ప్యాలెస్ ఎక్స్‌టెన్షన్ వద్ద ఉన్న తన స్నేహితులకు తెలియజేశాడు. దీంతో బాలనాగరాజ్ స్నేహితులు గ్రూపుగా విజయలక్ష్మీరోడ్డుపైకి రాడ్‌లతో వచ్చి వినయ్‌ను చితకబాదారు. దీంతో వినయ్ తలకు బలమైన గాయాలు కావడంతో కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగళూరుకు తరలించారు. ఈ మేరకు కుప్పం పోలీసులు నిందితులైన బాలనాగరాజ్, శ్రావణ్, ఉమాశంకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఆదివారం తెలిపారు.

నేడు సమగ్ర శిక్ష ఉద్యోగుల సదస్సు

బంగారుపాళెం: సమగ్ర శిక్ష ఉద్యోగుల సదస్సు సోమవారం తిరుపతిలో నిర్వహించనున్నట్లు ఏపీ సమగ్రశిక్షా కాంట్రాక్టు కౌట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జేఏసీ నాయకులు విల్వానాథన్, కృష్ణమూర్తి తెలిపారు. దీనికి ఉద్యోగులందరూ తప్పక హాజరు కావాలని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తిరుపతి యశోద నగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే సదస్సుకు తప్పని సరిగా హాజరు కావాలని కోరారు.

మాజీ మంత్రి ఆర్కేరోజాకు సత్కారం


మాజీ మంత్రి రోజాను అభినందిస్తున్న నేతలు

నగరి : మాజీ మంత్రి ఆర్కేరోజా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా నియమితులు కావడంపై స్థానిక పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని మాజీ మంత్రి నివాసానికి ఆదివారం వెళ్లిన నేతలు రోజాను దుశ్శాలువతో సత్కరించారు. అంకితభావంతో పనిచేస్తూ పార్టీ కార్యకర్తలకు నాయకులకు అందుబాటులో ఉంటూ గత పదేళ్లుగా నగరి నియోజకవర్గ ప్రజలకు సేవలు చేసినందుకు పార్టీలో సముచిత స్థానం కల్పించారని అభినందించారు. రోజా మాట్లాడుతూ పార్టీ ఇచ్చిన బాధ్యతను తప్పకుండా నెరవేరుస్తానన్నారు. పార్టీ బలోపేతానికి కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, కౌన్సిలర్లు బీడీ భాస్కర్, మురుగ, ఏపీ రాష్ట్ర బలిజ సేన ప్రధాన కార్యదర్శి. పి.గోపి పాల్గొన్నారు.

నవోదయ 3వ జాబితా ఫలితాల్లో విశ్వం ప్రభంజనం


నవోదయలో సీట్లు సాధించిన విశ్వం విద్యార్థులు

తిరుపతి ఎడ్యుకేషన్ : జవహర్ నవోదయ విద్యాలయంలో 2024–25విద్యాసంవత్సరంలో 6, 9వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్ష 3వ జాబి తా ఫలితాల్లో తిరుపతిలోని విశ్వం విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఈ మేరకు ఆ విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. నవోదయ ప్రవేశ పరీక్ష మూడు జాబితాల ఫలితాల్లో 6, 9వ తరగతిలోకి మొత్తం 59 మంది విద్యార్థు లు సీట్లు సాధించినట్లు తెలిపారు. గత 34 ఏళ్లగా జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్స్ వంటి పోటీ పరీక్షలకు నాణ్యమైన శిక్షణ ఇవ్వడంతో జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాలతో పాటు అత్యుత్తమ మార్కులు, ర్యాంకులను తమ విద్యార్థులు సాధిస్తున్నారని తెలిపారు. అనంతరం నవోదయలో సీట్లు సాధించిన విద్యార్థులను ఆ విద్యాసంస్థ అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, కరస్పాండెంట్ ఎన్.తులసీ విశ్వనాథ్ అభినందించారు.

బొలెరో బోల్తా : ఒకరి మృతి


మృతి చెందిన సుబ్రమణ్యం

పెద్దపంజాణి: అదుపు తప్పిన బొలెరో పికప్(ట్రాలీ) వాహనం బోల్తా పడి ఒకరు మృతి చెందగా, 23 మంది గాయపడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు, పెద్దపంజాణి మండలం వీరప్పల్లి పంచాయతీ మారప్పల్లెకు చెందిన 25 మంది బొలెరో వాహనంలో బయల్దేరారు. వీరు పలమనేరు మండలం కొలమాసనపల్లి సమీపంలోని గుండ్లపల్లిలో ఆదివారం జరిగిన బంధువు అంత్యక్రియలకు వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా, మార్గమధ్యంలోని దాసనంపల్లి సమీపంలోని దీపికా కోళ్లఫారమ్ వద్ద ఉన్న మలుపులో బొలెరో వాహనం అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనంపై పడిపోయింది. దీంతో ద్విచక్ర వాహన చోదకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు బైరెడ్డిపల్లి మండలం ధర్మపురి అగ్రహారానికి చెందిన నీరుగట్టి ఎల్లప్ప కుమారుడి ఎస్.సుబ్రమణ్యం(50)గా గుర్తించారు. ఈయన పెద్దపంజాణి మండలం కూరగాయల కొత్తపల్లిలోని అత్తగారింటికి వచ్చి వెళుతున్నారు. వాహనంలో ప్రయాణిస్తున్న 23 మందికి గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న స్థానికులు, పోలీసులు క్షతగాత్రులను హుటాహుటిన 108, ఇతర ప్రైవేట్ వాహనాల్లో పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. వీరిలో 8 మందిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సుబ్రమణ్యం మృతదేహాన్ని శవ పంచనామా నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దాడి కేసులో ఐదుగురి అరెస్టు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో రెండు రోజుల క్రితం యువకుడిపై జరిగిన దాడి ఘటనలో ఐదుగురి నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ నెట్టికంఠయ్య ఆదివారం వివరాలను మీడియాకు వెల్లడించారు. చిత్తూరు నగరానికి చెందిన యువకుడు వసంత్ తిరుపతిలోని ఓ దుకాణంలో పనిచేస్తున్నాడు. చర్చి వీధిలో ద్విచక్ర వాహనంపై వెళుతుండగా సంతపేటకు చెందిన అరుణ్ ద్విచక్రవాహనంపై వస్తూ ఎదురుగా ఢీ కొట్టాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది వెళ్లిపోయారు. అయితే వసంత్ అర్ధరాత్రి ఇంటికి వెళుతుండగా సంతపేట బ్రిడ్జి వద్ద కాపుకాసిన అరుణ్, స్నేహితులు గిరీష్, యశ్వంత్, జయరామ్, చిట్టిబాబుతో కలిసి కర్రలు, రాడ్‌లతో తీవ్రంగా కొట్టారు. తీవ్రంగా గాయపడ్డ వసంత్‌ను చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ దృశ్యాలను కొందరు మొబైల్‌లో వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో ట్రోల్ చేశారు. దీనిపై ఎస్పీ మణికంఠ సీరియస్‌గా స్పందిస్తూ.. ఇలాంటి ఘటనలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు ఐదుగురి నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

శోభ కుటుంబానికి పరామర్శ


శోభ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి

చౌడేపల్లె: ఎవరూ అధైర్యపడకండి.. ఏకష్టమొచ్చినా అండగా తామున్నామంటూ శోభ కుటుంబానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి భరోసా ఇచ్చారు. తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డిలతో కలిసి ఆదివారం మండలంలోని పందిళ్లపల్లె పంచాయతీ ముదిరెడ్డిపల్లెలో మాజీ సింగిల్ విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి ఇంటికి వెళ్లారు. గత నెల 5వ తేదీన రవిచంద్రారెడ్డి సతీమణి శోభ మృతిచెందిన విషయం తెలిసిందే. దశదిన కర్మక్రియలకు హాజరైన మాజీ మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు శోభ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.అనంతరం మండలంలోని వివిధ గ్రామాల నుంచి ముదిరెడ్డిపల్లెకు చేరుకొన్న వైఎస్సార్‌సీపీ నాయకులను, అభిమానులను పెద్దిరెడ్డి ఆప్యాయంగా పలకరించి, సరదాగా ముచ్చటించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, వైస్ ఎంపీపీ సుధాకర్ రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


మృతి చెందిన నాగరాజు

విజయపురం : మండలంలోని జంబాడ ఆదిఆంధ్రవాడలో వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన ఆదివారం వెలుగుచూసింది. స్థానికుల కథనం మేరకు, జంబాడ ఆదిఆంధ్రవాడకు చెందిన నాగరాజు (37) భార్య, పిల్లలతో తిరుపతి ఆటోనగర్‌లో నివాసం ఉంటున్నాడు. అయితే తన స్వగ్రామం అయిన జంబాడలో ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని తరుచూ రాకపోకలు సాగిస్తుంటాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం తన స్వగ్రామమైన జంబాడ సమీపంలో ఓ బ్రిడ్జి పక్కన గాయాలతో పడి ఉండగా, బస్సులో వెళుతున్న ఓ మహిళ గమనించి స్థానికులకు సమాచారమిచ్చింది. వెంటనే ఆయన బంధువులు తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. తన భర్తను ఎవరో హత్య చేశారని, భార్య విజయపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఏఎస్ఐ గోవిందరాజులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చెరువు మట్టి.. కొల్లగొట్టి..!


గుండ్లపల్లె అక్కంచెరువులో అక్రమంగా మట్టిని తవ్వుతున్న హిటాచీ

సాక్షి టాస్క్‌ఫోర్స్: పూతలపట్టు నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్లు చెరువు మట్టిని కొల్లగొట్టి. చెరువు మట్టిని రియల్‌ఎస్టేట్ వ్యాపారం కోసం మట్టిని తరలిస్తూ కాసులు దండుకుంటున్నారు. నియోజకవర్గంలో కూటమి నాయకులు ధనార్జనే ధ్యేయంగా కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. పొలాల్లో భూసారం కోసం వినియోగించే మట్టిని వ్యాపార కార్యకలాపాలకు తరలిస్తున్నారు. చెరువుల్లో మట్టిని హిటాచీలు, టిప్పర్ల ద్వారా కూటమి నాయకులు తరలిస్తున్నా రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు. నియోజకవర్గంలోని ఐరాల మండలం గుండ్లపల్లె సిద్ధగిరి క్షేత్రం ఎదురుగా ఉన్న అక్కం చెరువులో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. పచ్చనేతలు చెరువు మట్టినే కాకుండా వాగులు, వంకల్లో ఉన్న ఇసుకను కూడా మింగేస్తున్నారు. అక్కం చెరువు నుంచి మట్టిని మండలానికి చెందిన ఓ టీడీపీ నేత నెల రోజులుగా తరలిస్తున్నారు. తన రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం మట్టిని అక్రమంగా బొక్కేస్తున్నారు. మొరవ పాటూరు వద్ద నవరస ఫ్యాక్టరీని కొనుగోలు చేసి ప్లాట్లు వేయడానికి చెరువు మట్టిని అక్రమంగా తరలించారు. అక్కం చెరువును అడ్డదిడ్డంగా తవ్వేయడంతో చెరువు రూపురేఖలు మారిపోయాయి.